క్లుప్తంగా

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



అంగన్‌వాడీ స్కూల్‌ను సందర్శించిన చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తోందని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో అంగన్‌వాడీ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 6వ వార్డులోని రాయల్ పార్క్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

దుండిగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం మహిళా సంఘాల ఆర్పీలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మెప్మా పరిధిలో రిసోర్స్ పర్సన్లుగా పని చేస్తున్న తమకు జీవో 164లోని కొన్ని నిబంధనలతో నష్టపోతున్నామని, తమకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.18వేలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

మహిళా గ్రూపు ఆర్పీల అధ్యక్షురాలు మీనా, శ్యామల, మంజుల, కళ్యాణి, లక్ష్మి, పద్మలతో పాటు బీజేపీ మహిళా నాయకురాలు శ్రీదేవిరెడ్డి ఉన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

సుభాష్‌నగర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సూరారం రాజీవ్ గృహకల్పలో రూ.38 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డును శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు సంబంధించి అంచనాలు వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

కార్మికుల హక్కుల సాధనకు బీఆర్‌ఎస్‌కేవీ కృషి

రంగారెడ్డినగర్: కార్మికుల హక్కుల సాధన కోసం బీఆర్‌ఎస్‌కేవీ పని చేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడలోని కవిత ఎయిర్ ఎక్యూప్ సిస్టమ్స్ కంపెనీలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులు సనోజ్‌చౌదరి, అనిల్‌కుమార్, నర్సింహులును యాజమాన్యం ఎటువంటి కారణాలు చూపకుండా, నోటీసులు సైతం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ విషయమై కార్మికులు పలుమార్లు తమకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని సంప్రదించినా స్పందించకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించారు. కవిత ఎయిర్ ఎక్యూప్ సిస్టమ్స్ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటీ డబ్బులు ఇచ్చేలా ఒప్పించారు. ఒక్కొక్కరికి రూ.75వేల చొప్పున పరిశ్రమ యాజమాన్యం అందించిన రూ.2.25 లక్షల మొత్తాన్ని శనివారం రవిసింగ్ అంజేశారు.



కార్మికులకు చెక్కులు అందజేస్తున్న రవిసింగ్

డ్రైనేజీ పనుల పరిశీలన



అయోధ్యనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలో వినాయకనగర్ నుంచి అయోధ్యనగర్ వరకు జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కుత్బుల్లాపూర్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. రూ.8 లక్షల వ్యయంతో చేపడుతున్న పైపు లైన్ పనులు పూర్తయితే స్థానికంగా డ్రైనేజీ సమస్య తీరనుందని జీఎం తెలిపారు. జీఎం వెంట జీడిమెట్ల సెక్షన్ మేనేజర్‌తో పాటు అయోధ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు తదితరులు ఉన్నారు.

పొంగులేటిని కలిసిన సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శనివారం మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొన్ని రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న పొంగులేటిని వైఎస్సార్‌టీపీలో చేరాల్సిందిగా ఆహ్వానించినట్లు సురేష్‌రెడ్డి తెలిపారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు



జగద్గిరిగుట్ట: బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జగద్గిరిగుట్ట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.6 లక్షల 74వేల 959 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణమాచార్యులు తెలియజేశారు. శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో ఆలయం ఆవరణలో పర్యవేక్షణాధికారి వి.వి.సుబ్రహ్మణ్యం సమక్షంలో స్వామి వారి హుండీల లెక్కింపు చేపట్టారు. ఇందులో స్థానిక భక్తులు, నాయకులు సుధాకర్‌రావు, కైలాసం, శేషారెడ్డి, అర్చకులు రామాచార్యులు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దరువు అంజన్నకు బిరుదు ప్రదానం



కుత్బుల్లాపూర్: దరువు అంజన్నకు జానపద కళానిధి బిరుదు ప్రదానం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాటనే ఆయుధంగా చేసుకుని ప్రజల్లో చైతన్యం రగిలించడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ జేఏసీ చైర్మన్‌గా ఉద్యమ సమయంలో ఎన్నో సేవలు అందించిన దరువు అంజన్నకు మాస్టర్ జి ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాస్టర్ జి ఘనంగా సత్కరించి బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, ప్రజాహిత ఫౌండేషన్ చైర్మన్ మామిడి మోహన్‌రెడ్డి, రాయపోల్ కృష్ణారెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు బాగన్నగారి రవీందర్‌రెడ్డి, అందె ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ అందె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సుహాసిని

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాలతో మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుత్బుల్లాపూర్ బ్యాంక్ కాలనీలో నివాసముండే ప్రైవేట్ ఉద్యోగి మేకల రాజిరెడ్డి, సుహాసిని (27) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రాజిరెడ్డి మద్యం తాగుతుండడంతో సంవత్సరం క్రితం పిల్లలను తీసుకుని సుహాసిని పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు నెలల క్రితం భార్యకు నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చాడు. అయితే పలుమార్లు భార్యతో మాట్లాడేందుకు ప్రయత్నించగా పలకకపోవడంతో రాజిరెడ్డి భార్యపై కోపంతో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 3వ తేదీ మధ్యాహ్నం 2.10 గంటలకు భర్తకు ఫోన్ చేసిన సుహాసిని స్కూల్ నుంచి కుమారుడిని తీసుకు రమ్మని చెప్పింది. ఎం.ఎన్.రెడ్డినగర్‌లో ఉన్న స్కూల్ నుంచి కుమారుడిని తీసుకుని ఇంటికి రాగా కుమార్తె ఏడుస్తూ కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన అతను చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. ఆమె మొబైల్ స్విచ్ఛాఫ్ రావడంతో పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ (ఐవీఎంసీ)ను శనివారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దుండిగల్ తాండా సమీపంలోని రాంకీ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేస్ట్ ప్రోసెసింగ్ యూనిట్‌ను సందర్శించి పనితీరును పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, రెవెన్యూ అధికారి శ్రీహరిరాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



మార్కెట్‌ను సందర్శించిన మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మార్చి 31లోపు క్రమబద్ధీకరణ రుసుం చెల్లించాలి

దుండిగల్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు జీవో 59 కింద నోటీసులు అందిన ఇళ్ల యజమానులు మార్చి 31 లోపు మూడు వాయిదాల్లో డబ్బులు చెల్లించాలని గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్ పద్మప్రియ పేర్కొన్నారు. శనివారం గండిమైసమ్మలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలో జీవో 59 కింద అనేక దరఖాస్తులు వచ్చాయని, సెప్టెంబరు 2022లో రెవెన్యూ బృందాలతో సర్వే సైతం పూర్తి చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఆమోదం పొందిన వారికి నోటీసులు జారీ చేశామని, ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం మూడు వాయిదాల్లో రుసుం చెల్లించాలన్నారు. నిర్ణీత గడువు లోపు మొత్తాన్ని చెల్లించని వారికి అధికంగా చార్జ్ చేస్తామని చెప్పారు. కొందరు ధరలు తగ్గిస్తారనే భ్రమలో మొదటి వాయిదా కట్టలేదని, వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయని తెలిపారు. మార్చి 31 తర్వాత మార్కెట్ వాల్యూ పెరుగుతున్న దృష్ట్యా ముందస్తుగా డబ్బులు చెల్లించాలని, డబ్బులు చెల్లించిన వారికి ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని వెల్లడించారు.

'ఆస్తి పన్ను పెంపు తీర్మానాన్ని రద్దు చేయండి'

నిజాంపేట్: ప్రజలకు భారంగా మారే రెండింతల ఆస్తి పన్ను తీర్మానాన్ని రద్దు చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శనివారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి కార్పొరేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 13, 2023న కార్పొరేషన్ పరిధిలోని మూడు గ్రామ పంచాయతీల నాటి ఆస్తి పన్ను విధానాన్ని మార్చుతూ కార్పొరేషన్‌లో గృహాలకు 12 శాతం, కమర్షియల్ భవనాలకు 36 శాతం ఆస్తి పన్ను నిర్ధారించారని తెలిపారు. ఇటువంటి పన్ను విధానం రాష్ట్రం మొత్తంలో ఎక్కడా లేదని, జీహెచ్‌ఎంసీ పరిధిలో కంటే రెండింతలు నిర్ణయించడం సమంజసం కాదన్నారు. ధనార్జనే ధ్యేయంగా కార్పొరేషన్ పని చేస్తోందని ఆరోపించారు. 15వ కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేసి అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, బలహీన వర్గాల బస్తీల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో ఇంటి పన్ను ధరలు నిర్ధారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, నిజాంపేట్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శులు భిక్షపతియాదవ్, నరేంద్ర, కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్‌నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్ ఫేజ్ 2లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండడంతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన పైపులైన్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ లైన్ పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలన్నారు. కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు లేవని ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఏఈ శ్రావణి, మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ రవీందర్‌రెడ్డి, శివ, మల్లేష్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

గుర్తుతెలియని యాచకుడి మృతి

కుత్బుల్లాపూర్: గుర్తుతెలియని యాచకుడు మృతిచెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని బొల్లారం రోడ్డులో గత కొన్ని రోజులుగా సుమారు 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి యాచక వృత్తి చేసుకుంటూ తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం బొల్లారం రోడ్డు సమీపంలో పడి ఉన్నాడని స్థానికులు ఇచ్చిన సమాచారంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో లేదా చలికి తట్టుకోలేక మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

రసాయనాల డ్రమ్ము పేలి కార్మికుడు మృతి.. గోదాం యజమాని రిమాండ్

జీడిమెట్ల: ప్లాస్టిక్ గోదాంలో రసాయనాల డ్రమ్ము పేలడంతో కార్మికుడు మృతిచెందిన ఘటనలో గోదాం యజమానిని జీడిమెట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్ తజీర్‌నగర్‌లో నివాసముండే మహ్మద్ కుత్బుద్దీన్(59) జీడిమెట్ల పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న గంపల బస్తీలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ గోదాం నిర్వహిస్తున్నాడు. గత నెల 31న విజయ్‌ప్రజాపత్ (35), రమేశ్ అనే ఇద్దరు కార్మికులు పని చేస్తున్నారు. విజయ్‌ప్రజాపత్ రసాయన డ్రమ్మును యంత్రంపై కట్ చేస్తుండగా ఒత్తిడికి గురై ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అతడు మృతిచెందాడు. గోదాంలో నిబంధనలు పాటించకుండా కార్మికులతో పని చేయిస్తున్న కుత్బుద్దీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పవన్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాడతాం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని విజయానగర్, సాయినగర్‌లో గజ్జల యోగానంద్ బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా రెండు గంటలే ఉంటుందని, లో ప్రెషర్ సమస్య ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారులకు, కార్పొరేటర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. డ్రైనేజీ నీరు రోడ్ల మీదకు చేరుతుండడంతో దుర్వాసన వస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ కార్మికులు శుభ్రం చేసినా డ్రైనేజీల్లో ఉన్న చెత్తను అక్కడే వదిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల కొరత ఉందని, విద్యుత్ వైర్లు సరైన పద్ధతిలో లేకపోవడంతో నేలపైకి ఒరుగుతున్నాయన్నారు. 'మీ సమస్య మా పోరాటం' కార్యక్రమం ద్వారా త్వరలో పరిష్కరిస్తామని యోగానంద్ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజిత్ వర్మ, సురభి రవీందర్, స్రవంతి, రఘు, రామకృష్ణ, రత్నకుమార్, లడ్డూ, సిద్ధు, ఈశ్వర్, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ పాలక కమిటీ కాల పరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో యూనియన్ ఎన్నికలు నిర్వహించినట్లయితే కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. కాల పరిమితి ముగిసి నెల రోజులు అవుతున్నా ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించటకపోవడంతో పాటు కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని, ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

నార్త్ సిటీ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోల వెంకటేశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టి భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ వెంకటేశ్



విద్యార్థులు రూపొందించిన నమూనాలు